క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన మొలగవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

ఆలూరు రూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు మొలగవల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పీడీ మధుసూదన్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఈ నెల 6వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు చందన అండర్-14, హెప్సిబా అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ లూక్

వెల్దుర్తి(కృష్ణగిరి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ సూచించారు. మండల పరిధిలోని యాదరాళ్ల, రత్నపల్లి గ్రామంలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నుంచి వచ్చే సరుకులు అందించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి శ్రీకారం



టి.గోకులపాడులో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్

కృష్ణగిరి: పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ తెలిపారు. మండల పరిధిలోని టి.గోకులపాడు, తొగర్చేడు, రామకృష్ణాపురం, ఎరుకలచెరువు గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు రామాంజినేయులు, రేణుకమ్మ, వరలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, మండల నోడల్ అధికారి వెంకటలక్షుమ్మ, ఎంపీడీఓ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ సేవలకు ప్రశంసలు



ప్రశంసా పత్రాలతో ఆయా శాఖల మండలస్థాయి అధికారులు

హొళగుంద: గ్రామాలలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు విధులు నిర్వర్తించడం అభినందనీయమని ఎంపీడీఓ విజయలత అన్నారు. మంగళవారం సంపూర్ణ అభియాన్ (నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్) ముగింపు కార్యక్రమం జరిగింది. అందులో భాగంగా పథకం కింద ఎంపికైన గ్రామాలలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, టీచర్ల కొరత, విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన, రైతుల సంక్షేమం, పొదుపు మహిళలకు స్వయం ఉపాధి కల్పన ఇలా అనేక అంశాలపై వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిన ఆయా శాఖల అధికారులను ఎంపీడీఓ విజయలత, ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో రవిశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన కరివేముల లక్ష్మన్న

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో సోమవారం కరివేముల లక్ష్మన్న (44) అనే వ్యక్తి ఇంటికి ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆస్పరి సీఐ మస్తాన్ వలి మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. కరివేముల లక్ష్మన్నకు భార్య, నలుగురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఎలాంటి భూములు లేనందున కూలీ పనులకు వెళ్లి జీవనం చేసేవారు. అయితే కొన్ని సంవత్సరాల నుంచి లక్ష్మన్న మద్యానికి బానిసయ్యాడు. నలుగురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయలేనని మనో వేదనతో కరివేముల లక్ష్మన్న ఉరివేసుకుని చనిపోయినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

అంగన్‌వాడీ.. బోధన తడబడి

- మూడు నెలలైనా సరఫరా కాని పాఠ్య పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే నెట్టుకొస్తున్న వైనం
- పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్న తల్లిదండ్రులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో సకాలంలో రెండు రకాల కిట్ల పంపిణీ



అంగన్‌వాడీకేంద్రంలో పాత పుస్తకాలతోనే విద్యాబోధన

మద్దికెర: అంగన్‌వాడీ చిన్నారులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. కేంద్రాలు తెరచి నెలలు గడుస్తున్నా పాఠ్యపుస్తకాలు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా పాత పుస్తకాలతోనే బోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది.

గత ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ స్థాయి విద్యాబోధన

బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలు ఆయా కేంద్రాలకు అందజేసేది. నాలుగు పుస్తకాలతో కూడిన బర్డ్స్-1, బర్డ్స్-2 కిట్లను అందించింది. వీటితో పాటు ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ఇంగ్లిష్‌లో పాఠాలు బోధిస్తుంటే కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బోధనలకు సంబంధించి మూడేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిషు, యాక్టివిటి డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను అందించేవారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా పాఠ్య పుస్తకాల పంపిణీ ఊసే లేకుండా పోవడంతో అంగన్‌వాడీ వర్కర్లు చేసేదేమి లేక పాత పుస్తకాలతోనే చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలో..

మద్దికెరలో 39, పత్తికొండ 71, తుగ్గలి 77, కృష్ణగిరి 46, వెల్దుర్తి 63, మొత్తం 296 అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. ఈ కేంద్రాల్లో 10,024 మంది మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు నెలలు కావస్తున్నా అంగన్‌వాడీ కేంద్రాల వైపు దృష్టి సారించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రాలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు అందకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు పాత పుస్తకాలతోనే బోధిస్తున్నారు.

గత ప్రభుత్వం సకాలంలో పుస్తకాలను అందించడంతో పాటు వాటిలో చిన్నారులకు ఎంతో ఉపయోగపడే పాఠ్యాంశాలు వుండడంతో తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేంద్రాలకు తమ చిన్నారులను పంపించేవారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త పుస్తకాలను అందించకపోవడంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

విద్యాబోధనకు ఆటంకం లేదు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్యాభ్యాసానికి ఎటువంటి ఆటంకం కలగకుండా పాఠశాలల్లో వున్న పుస్తకాలతో విద్యాబోధన చేస్తున్నాం. త్వరలో పుస్తకాలు వస్తాయి. అంగన్‌వాడీ వర్కర్లు పిల్లలకు పాఠాలు, ఆటల ద్వారా విద్యను బోధిస్తున్నారు.

– త్రివేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మద్దికెర.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం

తుగ్గలి: చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల రోగాలను దూరం చేయవచ్చని పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాబురావు, ఏఎన్‌ఎం మహాలక్ష్మి చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలు, పెద్దలు భోజనం ముందు, కాల కృత్యాలు తర్వాత చేతులు తప్పనిసరిగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో చేతులు శుభ్రం చేయించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆలూరు రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆలూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ మంగమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి ఆలూరు నియోజకవర్గ శాసనసభ్యులు విరూపాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్‌తో పాటు ఎంపీటీసీలు, అన్ని గ్రామాల సర్పంచులు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని శాఖల మండలాధికారులు ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల పురోగతి, నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయి నివేదికలతో తప్పక హాజరుకావాలని సూచించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఆస్పత్రిలో మందుల స్టాకును తనిఖీ చేస్తున్న వైద్యాధికారి గంగాధర్

హాలహర్వి: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని వైద్యాధికారి ఎం.గంగాధర్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని అర్ధగేరి గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు అందాల్సిన వైద్యసేవలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాల కారణంగా ప్రజలు మంచినీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే వెంటనే పంచాయతీ అధికారులకు తెలియజేసి పారిశుద్ధ్య పనులు చేపట్టేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. గర్భిణుల కోసం ఉన్న ఏఎన్‌సీ చెకప్‌లను పర్యవేక్షించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

సీసీరోడ్లకు భూమి పూజ

తుగ్గలి: మండల పరిధిలోని ముక్కెళ్ల, మారెళ్ల, బొందిమడుగుల, రాంపల్లి గ్రామాల్లో మంగళవారం 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు సుజాత, మనీంద్ర, ఈవోపీఆర్డీ శ్రీహరి, నాయకులు సీసీరోడ్లకు భూమి పూజ చేశారు. ఉపాధి నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల పనులు చేపడుతున్న ఈవోపీఆర్డీ తెలిపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. నాయకులు తిరుపాల్‌నాయుడు, వెంకటరాముడుగౌడ్, వెంకటరాముడుచౌదరి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు మెలకువలు పాటించాలి



చింతకుంటలో రైతులకు మెలకువలు తెలియజేస్తున్న ఏఓ శివశంకర్

హాలహర్వి: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలు చేసిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ శివశంకర్, ఉద్యాన అధికారి ఇంద్రజ సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని సిరుగాపురం, చింతకుంట గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రైతులు వరి, కంది పొలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. వరిలో పైపాటి ఎరువులు ఇప్పుడే వద్దని, వర్షాలు తగ్గిన తర్వాత వేసుకోవచ్చని చెప్పారు. వేరుశనగ కోతలు పూర్తయి ఉంటే దిగుబడులు వర్షపునీటిలో తడవకుండా టార్పాలిన్స్‌తో కప్పి ఉంచుకోవాలన్నారు. కోతకు సిద్ధంగా ఉంటే వర్షం తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలన్నారు. పత్తి కోతను వాతావరణం అనుకూలించే వరకు వాయిదా వేసుకోవాలని సూచించారు. వీలైనంత వరకు పప్పు శనగను వర్షాలు తగ్గిన తర్వాత విత్తుకుంటే మంచిదన్నారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సొసైటీ మాజీ చైర్మన్ మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సహకార సొసైటీ మాజీ చైర్మన్ బొమ్మన శివశంకర్‌రెడ్డి(71) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, తిక్కారెడ్డి, గౌరు వెంకటరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో కేఈ శ్యాంకుమార్ పాల్గొని పాడే మోశారు.

ఆదర్శమూర్తి అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): దేశం గర్వించదగ్గ దార్శనికుడు, ఆదర్శ మూర్తి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని శ్రీసత్యసాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ జీవీ రమణ కొనియాడారు. మండల కేంద్రంలోని సత్యసాయి పాఠశాలలో మంగళవారం ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి విద్యార్థి నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ తిప్పారెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హొళగుంద: మాజీ రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ విద్యార్థులకు సూచించారు. బుధవారం హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలూరు: విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని ఆలూరు ఎంఈఓ కోమలాదేవి, ఎంఈఓ-2 చిరంజీవిరెడ్డి సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం మిస్సైల్‌మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

దేవనకొండ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దేవనకొండ మాజీ ఎంపీటీసీ నరసారావు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు. ఈ మేరకు మంగళవారం కర్నూలులోని ఎంపీ స్వగ్రామమైన పంచలింగాలలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో వెనకబడిన పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. దేవనకొండ మండలంలో మోడల్ స్కూల్ లేకపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దేవనకొండలో డీఎన్టీ హాస్టల్‌కు అదనపు గదులను ఏర్పాటు చేయాలని, ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

హంద్రీ – నీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ వద్ద హంద్రీ – నీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసి పైతట్టు గ్రామాలకు సాగునీరు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా నాయకులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోటకొండ గ్రామంలో సీపీఎం గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో సగానికి పైగా గ్రామాల్లో కరువు నెలకొంటోందని పరిష్కారంగా నిర్దేశించబడ్డ హంద్రీ – నీవాను పాలకులు, ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. హంద్రీ నీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసేంతవరకు పోరాడుతామని, పెద్దఎత్తున రైతులతో కలిసి ఉద్యమాలకు పూనుకుంటామని స్పష్టం చేశారు. నాయకులు సూరి, సంజన్న, మహబూబ్, అస్లాంబాషా, ఉపసర్పంచ్ కౌలుట్ల, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, బిణిగేరి, జొహరాపురం గ్రామాలలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టే పనులకు ఎంపీడీఓ గీతావాణి, టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్ సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

మారుకా పురుగును నివారించాలి

గోనెగండ్ల: కంది పంట సాగుచేసిన రైతులు మారుకా పురుగు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. మంగళవారం మండలంలోని బి.అగ్రహారంలో గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కందిలో మారుకా పురుగు నివారణకు నోవాలురాన్ ఒక మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 2024లో ఖరీఫ్ పంట నమోదు, ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల తుది జాబితా రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వాటిలో సరి చూసుకొని, ఏమైనా తప్పులు ఉంటే అధికారులచే సరిచేయించుకోవాలని సూచించారు.

జయప్రదం చేయండి



ఆస్పరిలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్

ఆస్పరి: ఆదోనిలో నవంబర్ 5, 6 తేదీల్లో జరిగే ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆస్పరిలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించాయన్నారు. జాతీయ నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ, ప్రవేటీకరణ, కార్పొరేటీకరణ చేసేందుకు తెరలేపిందన్నారు. జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంగస్వామి, ఉపాధ్యక్షులుగా జగదీష్, శశికాంత్, ప్రధాన కార్యదర్శి రెహమాన్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఈశ్వర్, రమేష్, రాజు, అనిల్, నాగముని, నల్లారెడ్డి పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ ఆనంద్ లోకదళ్ సూచించారు. మంగళవారం పెద్దగోనెహాళ్, ఇంగళదహాళ్ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నానో యూరియా, నానో డీఏపీ, సాయిల్ హెల్త్ కార్డుల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. అధిక వర్షపాతం నమోదైతే పైర్లు దెబ్బతినకుండా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఏఈఓ విరుపాక్షి, రైతులు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ డాక్టర్ ఎస్ భరత్‌నాయక్

పత్తికొండ(తుగ్గలి): రెవెన్యూ ఉద్యోగులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆర్డీఓ డాక్టర్ ఎస్ భరత్‌నాయక్ అన్నారు. పత్తికొండ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విధులకు సకాలంలో హాజరవుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భూ సమస్యలపై విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా వారి సమస్యలను పరిష్కరించి పంపాలన్నారు. చుక్కల భూముల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరమే సమస్యల పరిష్కారం

మద్దికెర: రైతులు, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్జీ ఇచ్చిన వెంటనే సంబంధిత అధికారులు నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేసి సకాలంలో పరిష్కరించాలన్నారు. అంతేగాక తుపాను నేపథ్యంలో విద్యుత్ తీగలు తెగిపడినా, చెరువులు నిండి గ్రామాల్లోకి నీరు వచ్చే సూచనలు వున్నా వీఆర్ఏలు గ్రామాల్లో అందుబాటులో వుండి అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ వున్నారు.

ఎట్టకేలకు పేర్లు మార్పు



సూచిక బోర్డులో ప్రస్తుత అధికారుల పేర్లను చేర్చిన దృశ్యం

చిప్పగిరి: ఎట్టకేలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పాత అధికారుల పేర్లను తొలగించి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అధికారుల పేర్లను చేర్చారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ కొండయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు బదిలీపై వెళ్లగా ఎంపీడీఓగా అల్లాబకాష్, సీనియర్ అసిస్టెంట్‌గా శ్రీనివాసులు చిప్పగిరికి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. అయితే కార్యాలయ సూచిక బోర్డులో మాత్రం పాత అధికారుల పేర్లు దర్శనమిస్తుండడంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన మండల ప్రజలు తమకు కావాల్సిన సమాచారం ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై గత వారం 'సమాచారం ఇచ్చేదెవరు?' అనే కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన ఎంపీడీఓ అల్లాబకాష్ మంగళవారం సూచిక బోర్డులో ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారుల పేర్లు చేర్చి సమస్య పరిష్కరించారు. సమస్య పరిష్కారంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద తుంగభద్ర నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి: బంగాళ ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణం మరో రెండు రోజుల పాటు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని, తుంగభద్ర నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మంగళవారం కోసిగి మండలం కందుకూరు గ్రామ సమీపంలోని రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) ఆనకట్ట వద్ద తుంగభద్ర నది నీటి ప్రవాహాన్ని తహసీల్దార్ నిత్యానందరాజుతో కలిసి పరిశీలించారు. వర్షాల కారణంగా తుంగభద్ర నది నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. నదితీర ప్రజలు, రైతులు, చేపలు పట్టే జాలర్లు నది వైపు వెళ్లరాదన్నారు. తీర ప్రాంతంలోని పొలాల రైతులు అప్రమత్తంగా ఉండి మోటార్లు, పనిముట్లు భద్రపరుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీరు వస్తే పునరావాస కేంద్రంగా కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ తిక్కస్వామి, వీఆర్వో బసవరాజు, బాలస్వామి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: ఆలూరు మంలం మణెకుర్తి గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. పెసలబండ గ్రామానికి చెందిన ఉపేంద్ర, మౌనిక ఆలూరు మండలం దేవరగట్టులో మాళమల్లేశ్వర స్వామి దర్శనం చేసుకుని బైకుపై తిరిగి వస్తుండగా మణెకుర్తి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైకు ఢీకొంది. దీంతో ఉపేంద్ర, మౌనికకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఉపేంద్రను కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పెద్దహ్యాట కొండపై పొగమంచు



హొళగుందలో పెద్దకొండను కమ్ముకున్న పొగమంచు

కొండపై మంచు దుప్పటి

హొళగుంద: అల్పపీడన ప్రభావం వల్ల మండలంలోని హొళగుంద, పెద్దహ్యాట తదితర గ్రామాల పరిధిలోని కొండలను మంగళవారం ఉదయం మేఘాలు కమ్ముకున్నాయి. ఒక వైపు చిన్న చినుకులు, మరో పక్క కొండలను కుమ్మకున్న పొగమంచు ఉదయం చూపరులను అమితంగా ఆకట్టుకుంది. చల్లటి గాలితో ఆహ్లాదకర వాతవరణం నెలకొనగా అడపాదడపా చినుకులు రాలుతూ పరవశింపజేస్తున్నారు. కొండల నుంచి వర్షపు నీరు కిందకు పారుతూ జలపాతాలను తలపిస్తున్నాయి. వేసవిలో చినుక జాడ లేక కొండలు, మైదానాలు పచ్చదనం కోల్పోగా ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలతో పచ్చదనం సంతరించుకుంది.